క్లుప్తంగా

పోలీసుల కార్డన్ సెర్చ్



వాహనాల పత్రాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బంది ప్రత్యేక నిఘా వేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం టెక్కలి మండలం రావివలస గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐలు లక్ష్మీ, వేంకటేశ్వరరావు తో పాటు సిబ్బంది నేతృత్వంలో గ్రామంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎటువంటి పత్రాలులేని ఆరు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం



కొత్తపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అప్రమత్తత అవసరమని కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం అన్నారు. మండలంలోని కొత్తపల్లి, చిన్నసాన, రామేశ్వరం గ్రామాల్లో 482 పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు సోమవారం వేశారు. రానున్న వర్షాకాలం కారణంగా వాతావరణ మార్పుల దృష్ట్యా పాడి పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. అధిక జ్వరం, మేత మేయకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ పశువులకు ఉచితంగా జబ్బవాపు నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు ఫ్యాన్‌ల వితరణ



వృద్ధురాలికి టేబుల్ ఫ్యాన్ అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మండు వేసవి వేడిమికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు మాజీ సైనికులు ముందుకొచ్చి సాయం అందిస్తున్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన మాజీ సైనికులంతా ఒకే వేదికపైకి వచ్చి తమకు తోచినవిధంగా సమాజానికి అవసరమైన వాటికి సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని పలు వీధుల్లో ఉన్నటువంటి ఆదరణ లేని వృద్ధులకు టేబుల్ ఫ్యాన్‌లను అందించారు.

వైభవంగా పాలపోలమ్మ ఉత్సవాలు



గ్రామ దేవత ఉత్సవాల్లో సందడి

కంచిలి: మండలంలోని అంపురం గ్రామంలో గ్రామ దేవత పాలపోలమ్మ మహోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి వైభవోపేతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపుతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పెద్ద ఎత్తున గ్రామంలో సంబరాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్తులు విచ్చేస్తున్నారు.

'ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం'



శాంతమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని దేవునల్తాడ గ్రామానికి చెందిన నిరుపేద మత్స్యకార మహిళ తెరిపల్లి శాంతమ్మకు సేవా సమితి ప్రతినిధులు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. శాంతమ్మకు రెక్కాడితే గానీ డొక్కాడదు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆమె పరిస్థితిని గమనించి సాయం అందించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చింత మోహన్‌రావు, మండల మహేష్, శ్రీను, పాపారావు, దానేష్, ఈశ్వరరావు, నీలయ్య, జి.ఉమ, కె.మోహిని, ఎస్.రాణి తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాలను వండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వేంకటేశ్వరరావు



మధ్యాహ్న భోజనం తయారీ విధానాన్ని తెలియజేస్తున్న ఆర్పీ రాము

ఇచ్ఛాపురం రూరల్: సర్కారు బడుల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనాలను నిర్వాహకులు రుచికరంగా వండాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వేంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ విద్యార్థి బడిలోనే భోజనం చేసే విధంగా విద్యార్థులకు పోషకారం అందించేందుకు మరింత శ్రద్ధ వహించాలన్నారు. వంట పాత్రలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. 69 పాఠశాలలు నుంచి వచ్చిన నిర్వాహకులతో ఆయన నేరుగా మాట్లాడారు. ఎంఈవో కురమాన అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎండీఎం జిల్లా ప్రత్యేక శిక్షకులు యు.రాము భోజనాలు తయారీ చేసే విధానం, మెనూపై శిక్షణ ఇచ్చారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్



ఇచ్ఛాపురం: స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు



సోంపేట: పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో వేంకటేశ్వరరావు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మండల కేంద్రాల్లోని ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ని మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు సోమవారం పరిశీలించారు. ఆయనతో పాటు సమగ్ర శిక్ష సిబ్బంది ఉన్నారు.

సోంపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు సోమవారం చేరుకున్నాయని విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు తెలియజేశారు. స్టాక్ పాయింట్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.వేంకటేశ్వరరావు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు మాట్లాడుతూ 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 15,793 పాఠ్య పుస్తకాలు, 42,180 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన తరగతుల పాఠ్య పుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చేరుకుంటాయని తెలిపారు. పలువురు విద్యా వనరుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అసిరిపోలమ్మ సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



వీధినాటక వేషధారణలు

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారిని మేళతాళాలతో గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పౌరాణిక ఘట్టాల రథాలు, వీధి నాటకాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చివరి మూడురోజులు కావడంతో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.



సూర్య భగవానుడి విగ్రహం



ఆకట్టుకుంటున్న ఈశ్వరుని రథం

నేడు కంచమ్మతల్లి చల్లదనం



కంచిలి: స్థానిక ప్రజల ఆరాధ్య దేవత కంచమ్మ తల్లి చల్లదనం మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని మొదట రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్నటువంటి ఉత్సవ స్థానం నుంచి మెయిన్‌రోడ్డులో ఎస్ఆర్‌సీపురం వైపు కేశవరావు దాబా హోటల్ కూడలి వరకు వెళ్లి, అటునుంచి మళ్లీ మెయిన్ రోడ్డు మీదుగా మఠం కంచిలి వరకు ఊరేగింపు చేపట్టడానికి నిర్ణయించారు. అమ్మవారిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి అమ్మవారి దత్తత గ్రామాల భక్తులంతా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి సరఫరా బంద్



మరమ్మతులు జరుగుతున్న పైపులైన్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం పురపాలక సంఘం పరిధిలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు మున్సిపల్ తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ 3వ బావి వద్ద మెయిన్ పంపింగ్ పైపులైన్ మరమ్మతులకు గురవ్వడంతో తాత్కాలికంగా పంపింగ్ ఆపివేయడం జరిగిందన్నారు. నీటి సరఫరా నిలిపి వేయబడిన ప్రాంతాల్లో అద్దె ట్యాంకర్లుతో సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అంతరాయాన్ని ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్:

పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఏఎన్ఎం ఉషారాణి అన్నారు. ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండపల్లి గ్రామంలో కిశోర బాలికలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే మంచి సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నెలసరి సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలని, దాని వలన ఋతుస్రావం సమయంలో వచ్చే నష్టాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బర్రి నరసమ్మ, కె.జ్యోతి, కె.సునీత, జి.జ్యోతి, ఎస్.శారద, ఎం.జ్యోతి, పి.లలిత, ఆశావర్కర్లు పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులకు ఆటలు ఆడిస్తున్న దృశ్యం

టెక్కలి: విద్యార్థులకు క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటలు సోమవారం ఆడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతిరోజూ విద్యార్థులకు వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

'రైతుల సమస్యలను పరిష్కరించండి'

కాశీబుగ్గ:

జిల్లాలో ఉన్నటువంటి రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పలాస తహసీల్దార్‌కు వినతి పత్రం సోమవారం అందజేశారు. రైతు సంఘ నాయకుడు చాపర వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో విత్తనాలు, పంట రుణాలు అందించలేదన్నారు. రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు 90 శాతం సబ్సిడీపై అందించాలని, రాష్ట్రంలో గత సంవత్సరం తీవ్రమైన కరువుతో పాటు మిచాంగ్ తుపాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంకల ముకుందా, హనుమంతు రమణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఊపందుకున్న ఉపాధి పనులు



వజ్రపుకొత్తూరులో జరుగుతున్న ఉపాధి పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజల వలసలను నివారించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఉపాధి పనులు ఊపందుకున్నాయి. మండలంలోని సీతాపుర, పెద్దబొడ్డపాడు, కొండవూరు, దేవునల్తాడ, వజ్రపుకొత్తూరు, పీఎంపురం, రాజాం, పల్లివూరు, కిడిసింగి, శారదపురం, తాడివాడ, రామకృష్ణపురం, పాతటెక్కలి తదితర గ్రామా ల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి మండలంలో 3,400 మంది వేతనదారులు పలు రకాలు పనుల్లో పాల్గొంటున్నారు.

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాను



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



హాజరైన పలాస నియోజకవర్గ శ్రేణులు

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందని, తనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మరికొద్ది రోజుల్లో ఘన విజయం సాధించి ప్రభుత్వ నిర్మాణం చేస్తామన్నారు. మనల్ని నమ్ముకున్న ప్రజలకు సేవచేసే భాగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వజ్రపుకొత్తూరు: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు



కాశీబుగ్గ: గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ రాధిక

● ఎస్పీ జీఆర్ రాధిక

కాశీబుగ్గ: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జీఆర్ రాధిక హెచ్చరించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చిన్నబడాం గ్రామంలో సోమవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఇటీవల ఎన్నికల అనంతరం జరిగిన చిన్నపాటి ఘర్షణలకు ఇరువర్గాలకు చెందిన పలువురుపై బైండోవర్ కేసులు నమోదు చేసిన విషయాలు ప్రస్తావించారు. ఓట్లు లెక్కింపు దగ్గర పడుతున్న తరుణంలో గ్రామంలో ఎవరైనా గలాటా చేస్తే సహించేదే లేదన్నారు. ఆమెతో పాటు డీఎస్పీ నాగేశ్వర రెడ్డి, సీఐ విజయ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: కౌంటింగ్ సమయంలో వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సీహెచ్ రామారావు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొత్తపేట, దేవునల్తాడ గ్రామస్తులతో శాంతిభద్రతలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో ప్రతీ ఒక్కరూ అన్నదమ్ముల్లా మెలగాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు పేల్చడం ఎన్నికల ఫలితాలు అనంతరం కూడా నిషేధమని స్పష్టం చేశారు. ఆయనతో పాటు స్థానిక పోలీసులు ఉన్నారు.

చెత్తతో సంపద సృష్టి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

వజ్రపుకొత్తూరు: పంచాయతీల్లో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా తడి, పొడి చెత్తతో సంపద సృష్టించవచ్చునని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. మండలంలోని పాతటెక్కలి గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి కంపోస్టు ఎరువు తయారీ చేసి, వాటిని వ్యవసాయం, కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ఎరువుగా సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తడి, పొడి చెత్తను ఉంచే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ మధుబాబు, వీఆర్వో గాలి రవి తదితరులు పాల్గొన్నారు.

20 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు



దివ్యాంగ చిన్నారితో అధికారులు

కంచిలి: మండలంలో 20 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రంలో మఠం కంచిలి గ్రామంలో ఒక బాలుడిని సోమవారం గుర్తించారు. ఈ అబ్బాయికి స్పీచ్ థెరిఫీ, ఫిజియోథెరపీలు అవసరమన్నారు. త్వరలో ఈ సేవలు, ఉపకరణాలు అందించాల్సిందిగా భవిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీలక్ష్మీ, భవిత ఐఈఆర్‌టీలు టి.చంద్రశేఖర్, నిర్మల పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటైన శ్రీకాకుళం జిల్లా నందిగాం మం॥ కొత్త అగ్రహారం గ్రామ కాపురం పాలిన (లేటు) కామేశ్వరరావు గారి కుమారుడు పాలిన గిరి ఇచ్చిన భోగట్టాపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు తాతగారు పాలిన రాములు మరియు అతని సోదరుడు పాలిన రాజులు ఏక గర్భజనితులై వున్నారు. వారికి వంశపారం పర్యముగా సంక్రమించిన ఆస్తులు సర్వే నెంబర్లు 86/6 –0.14 సెంట్లు సం॥నెం॥ 45/4 –0.36 సెంట్లు, సం॥నెం॥ 46/6 –0.26 సెంట్లు సం॥నెం॥39/4 –0.27 సెంట్లు, సం॥నెం॥ 28/4 –0.17 సెంట్లు, వెరశి ఎ 1.19 సెంట్లు పల్లపు భూమి మరియు మెట్టు తోట 0.80 సెంట్లు కొత్తఅగ్రహారం రెవెన్యూ పరిధిలో నందిగాం మండలంలో యుండి ఉంటెను. సదరు ఆస్తిలో పల్లం భూమి నా క్లయింటు తాతగారు మరియు అతని సోదరుడు రాజులు ఏకస్తులై వేరే వారికి అమ్మివేసిన ధనంతో ఓన్నాబడాంలో కొంత స్థలము కొని దానిపై ఇల్లు కట్టుకొని మరి కొంత సొమ్ముతో పాడి గేదెలు కొని పాల వ్యాపారం చాలి జీవనోపాధిగా చేసుకున్నారు. పాల వ్యాపారంతో మిగిలిన కొంత సొమ్మును పాడి గేదెల సంరక్షణకై శాల ఇల్లు కట్టినారు. అన్నదమ్ములు ఉభయులు సమన్వయంతో పాల వ్యాపారం చేస్తూ అభివృద్ధి చెందుతూ అర్థికంగా స్థిరపడ్డారు. నా క్లయింట్ పితామహుడు పాలిన రాములు పాలిన రాజులు కంటె పెద్దవాడైననూ అమాయకత్వం వల్ల అతను తమ్ముడు రాజులే వారి వ్యవహారం మేనేజ్ చేసేవారు. ఇది ఇలా వుండగా రాములు (20 సం॥ల క్రితం) చనిపోయారు. తదనంతరం రాములు ఏకైక పుత్రుడు నా క్లయింటు తండ్రియైన కామేశ్వరరావు మరియు అతని చిన్నాన్న గారు అయిన రాజులు వారి సమిష్టి కుటుంబ ఆస్తులు పంపకం చేసుకున్నారు. ఆ పంపకం ప్రకారం కొత్తఅగ్రహారంలో వారి కుటుంబానికి సమిష్టిగా వున్న మామిడి తోట సర్వే నెంబరు 90-12లో 0.80 సెంట్లు కామేశ్వరరావు వాటాను కేటాయించడమైనది. చినబడాంలో హైస్కూల్ ప్రక్కన వున్నటువంటి బిల్డింగ్, పశువుల శాల రాజుకు కేటాయించడం అయినది. అప్పటి నుండి ఎవ్వరికి సంక్రమించిన ఆస్తులు వారే అనుభవించుచున్నారు. తదుపరి కామేశ్వరరావు 25-10-2013 సం॥లో చనిపోయినారు. అంతకు ముందే తన భార్య పార్వతి స్వర్గస్తురాలైనది. సదరు కామేశ్వరరావు పార్వతిల ఏకైక పుత్రుడే (సంతానం) ఏకైక వారసుడు నా క్లయింటైన గిరియే సదరు కామేశ్వరరావు వారి చిన్నాన్న రాజులు సమిష్టి ఆస్తుల పంపకం సమయంలో ఈ దిగువ షెడ్యూలు ఆస్తి కామేశ్వరరావుకి వచ్చినందున నా క్లయింటే ఆస్తికి వారసుడు. అటులా వుండగా నా క్లయింటుకు తల్లిదండ్రులు లేనందున సదరు ఈ ప్రకటన దాఖల ఆస్తి కాజేయుటకు పాలిన రాజులు ప్రయత్నం చేయుచున్నారు. సదరు షెడ్యూలు దాఖల ఆస్తి పాలిన రాజులు కిం గంగయ్యతో ఎవ్వరు ఏమైనా లావాదేవీలు, తనఖా క్రయము పొందినచో చట్ట ప్రకారం చెల్లనేరవు. మరియు నా క్లయింటుకు బైండ్ వేయవు. షెడ్యూలు దాఖల ఆస్తికి సర్వ హక్కులు నా క్లయింటుకే చెందియున్నాయి.

షెడ్యూలు ఆస్తి: శ్రీకాకుళం జిల్లా నందిగాం మం॥, కాశీబుగ్గ సబ్ డివిజన్‌లో కొత్త అగ్రహారం రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 90-12కు లో గల 0.80 సెంట్లు మామిడి తోటకు హద్దులు: తూర్పు: బొండాడ వెంకటరావు తోట, పడమర: బొండాడ వెంకటరావు తోట, దక్షిణ: ఊటల అప్పలస్వామి తోట, ఉత్తర: బంగారి కృష్ణమ్మ తోట.

సం/- పి.జి.రాజారత్నం, అడ్వకేటు
ఓంశాంతి నగర్, కాశీబుగ్గ, శ్రీకాకుళం జిల్లా
సెల్: 9985827526